'కేంద్రం' నిర్ణయంతో ఊరట

- ఉపాధి కూలీలకు వేతనం రూ.15 పెంపు
- పెరిగిన దినసరి కూలీ రూ.257 నుంచి రూ.272
- అమల్లోకి పెరిగిన కూలీ
- శివారు మేడ్చల్,రంగారెడ్డి జిల్లాలలో 1.32 లక్షల మంది కూలీలకు ప్రయోజనం



సాక్షి, మేడ్చల్ జిల్లా: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పని చేసే కూలీలకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయంతో ఊరట లభించింది. దినసరి కూలీ రేటును రూ.257 నుంచి రూ.272కు పెంచుతున్నట్లు కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఏప్రిల్ నుంచి అమలులోకి రానుండటంతో నగర శివారు రంగారెడ్డి, మేడ్చల్ -మల్కాజిగిరి జిల్లాలలోని 1.32 లక్షల మంది ఉపాధి కూలీలకు లబ్ధి చేకూరుతోంది. గ్రామాల్లో వలసలను నివారించాలనే సంకల్పంతో 2006లో అప్పటి కేంద్ర ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని ప్రవేశపెట్టింది. ఆ తర్వాత ఉపాధి హామీ పథకంలో ఆడ, మగ వారికి సమానమైన వేతనాలను చెల్లిస్తోంది.

నేరుగా కూలీల ఖాతాల్లోకి...

ఉపాధి హామీ పథకంలో దినసరి కూలీల రేట్లను పరిశీలిస్తే.. మొదట రూ.37.50 చెల్లింపు నుంచి క్రమేణా పెరుగుతూ రూ.272కు చేరింది. ఉపాధి హామీ నిధులను ఇన్నాళ్లు రాష్ట్ర ప్రభుత్వం ఇతర పనులకు వినియోగించే అవకాశముండేది. కొత్త సాఫ్ట్‌వేర్‌తో పనిచేసిన కూలీల మస్టర్ ఆన్‌లైన్‌లో నమోదుకాగానే నేరుగా వారి ఖాతాలకే చెల్లింపులు జమకానున్నాయి. గ్రామం యూనిట్‌గా ఉపాధి హామీ పనులు జరగటంతోపాటు కూలీలగ్రూపుల వ్యవస్థ ఉండకుండా చర్యలు తీసుకున్నారు. ప్రస్తుతం ఏ రోజు పనికి ఆరోజు డిమాండ్‌ను బట్టి పని కల్పించే వెసులుబాటు కల్పించారు.

పని ముందే గుర్తించాలి...

కూలీలు చేయగలిగే 100 రోజులకు సరిపడా పనుల గుర్తింపు చేసి గ్రామసభలో తీర్మానం చేసి ఉపాధి పనులు ఆమోదింపజేయాల్సి ఉంది. పాత విధానంలో రాష్ట్ర ప్రభుత్వం వేసవి భత్యం కింద కూలీలు చేసేపనికి వేతనం ఇచ్చేది. అయితే కొత్త విధానంలో పని నిత్యం ఉండదు.

ఉపాధి కల్పించకుంటే...

పని కోసం దరఖాస్తు చేసుకున్న కూలీలకు 15 రోజుల్లో ఉపాధి కల్పించకుంటే నిరుద్యోగ భృతి చెల్లించే విధానం అమల్లోకి వచ్చింది. మస్టర్ పూర్తయిన వెంటనే అయిదు రోజుల్లో చెల్లింపులు ఉంటాయి. ఒకవేళ నమోదు చేయకుంటే ఆలస్య రుసుము విధిస్తారు. కొత్త విధానంలో కూలీలకు మరింత లాభం చేకూరేలా కేంద్రం మార్గదర్శకాలున్నాయి. ప్రతి గ్రామ పంచాయతీకి ఒక మేట్‌ను నియమించుకోవాల్సి ఉంటుంది. ఉదయం కూలీలు పని ప్రదేశానికి హాజరు కావాల్సింటుంది. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటలలోపు వారు తమ హాజరును ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాల్సి ఉంటుంది.

ప్రతీ రోజు ఉపాధి కూలీ రూ.272

కేంద్ర ప్రభుత్వం మార్చి 24న ఉపాధి కూలీ ధరను రూ. 15 పెంచుతూ ఉత్తర్వులు జారీచేసింది. పెంచిన ధరలు ఏప్రిల్ 1 నుంచి అమలు చేస్తారు. గతంలో రోజు పనిదినానికి రూ. 257 చెల్లించగా అదనంగా మరో రూ.15 పెంచటంతో రూ. 272 అందించనున్నారు. వేసవిలో సాధారణంగా పనులు తక్కువగా ఉండటం వల్ల కూలీల సంఖ్య గణనీయంగా పెరుగుతుంది. పెంచిన కూలీ భత్యంతో ఆర్థికంగా లాభం చేకూరనుంది. కాగా కేంద్రం ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన ఎన్‌ఎంఎంఎస్ (నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టమ్) విధానం కూలీలకు ఇబ్బందిగా మారింది.

ఉపాధి కూలీ పెంపుతో మేలు

పెరిగిన కూలీ ధరలతో సమానంగా కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ ఉపాధి కూలీ దినసరి కూలీ వేతనం రూ.257 నుంచి రూ. 272కు పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది. శివారు జిల్లాలలోని ఉపాధి కూలీలకు లబ్ధి చేకూరనుంది.ఉపాధి కూలీలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

- పద్మజారాణి ,డీఆర్డీవ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా

శివారు రోడ్లకు మహర్దశ

- రూ.293 కోట్లతో లింక్ రోడ్ల నిర్మాణం
- 5 పురపాలక సంఘాల్లో 13 రోడ్లకు మోక్షం
- రోడ్లు పూర్తయితే.. నగరం నుంచి శివారు పట్టణాలకు మెరుగుకానున్న రవాణా

సాక్షి,మేడ్చల్ జిల్లా: నగర శివారు పురపాలక సంఘాల్లోని రోడ్లకు మహర్దశ కలుగనుంది.ప్రభుత్వం ఐదు పురపాలక సంఘాల పరిధిలోని 13 లింక్ రోడ్ల నిర్మాణానికి రూ.293 కోట్లు కేటాయించటంతోపాటు త్వరలో పూర్తయ్యేలా ఆదేశించింది. ఈ నేపథ్యంలో కొన్ని లింక్ రోడ్ల నిర్మాణ పనులను కూడా సంబంధిత పురపాలక సంఘాలు ప్రారంభించటంతోపాటు రానున్న సాధారణ ఎన్నికల లోపు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నాయి. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని జవహర్‌నగర్, ఘట్కేసర్, దమ్మాయిగూడ, నాగారం,పోచారం, పురపాలక సంఘాల్లో నాలుగు లేన్లు, ఆరులేన్లతో విశాలమైన రోడ్లు నిర్మించేలా పనులు చేపట్టనున్నారు. ఇన్నర్ రింగ్ రోడ్, ఔటర్ రింగ్ రోడ్‌కు అనుసంధానంగా ప్రజల సాఫీగా ప్రయాణించేందుకు లింక్, స్లిప్ రోడ్లలోభాగంగా ప్రభుత్వం ఇటీవల 13 లింక్ రోడ్ల పనులకు నిధులు మంజూరు చేసింది. మూడో ప్యాకేజీల్లో 13 కారిడార్ల (రోడ్ల) పనులను హైదరాబాద్ రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్‌ఆర్ డీసీఎల్) చేపట్టనుంది. వీటి అంచనా వ్యయం రూ.293 కోట్లు కాగా, ఏడాదిలోగా పనులు పూర్తిచేసేలా మున్సిపల్ అధికారవర్గాలు చర్యలు చేపడుతున్నారు.ఈ రోడ్లు అందుబాటులోకి వస్తే నగరం నుంచి శివారు పురపాలక సంఘాలకు సాఫీ రవాణా సాధ్యమవుతోంది. ప్రజలకు ప్రయాణదూరం, సమయం తగ్గనుంది. వాహన కాలుష్యం కూడా తగ్గడంతోపాటు ప్రయాణాల వల్ల తలెత్తే ఆరోగ్య ఇబ్బందులు తొలగగలవని పురపాలక సంఘాలు పేర్కొంటున్నాయి.

లింక్ రోడ్ల నిర్మాణం ఇలా...

- జవహర్‌నగర్ పురపాలక సంఘంలో ఫైరింగ్ కట్ట నుంచి ఎన్టీఆర్ విగ్రహం రోడ్
- వరకు 2.10 కిలోమీటర్ల పొడవు, ఎన్టీఆర్ విగ్రహంనుంచి దమ్మాయిగూడ రోడ్ వరకు 1.30 కిలోమీటర్ల పొడవు, అలాగే,ఎన్టీఆర్ విగ్రహం నుంచి డంపింగ్ యార్డ్ వరకు 2.35 కిలోమీటర్ల పొడవు,ఎన్టీఆర్ విగ్రహం నుంచి వంపుగూడ రోడ్ వరకు 1.20 కిలోమీటర్లు పొడవు
- పోచారం పురపాలక సంఘాల్లో యామ్నాంపేట నుంచి ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్ వరకు 2.10 కిలోమీటర్ల పొడవు.
- ఘట్కేసర్ పురపాలక సంఘంలో శివారెడ్డిగూడ నుంచి మాధవ్ రెడ్డి బ్రిడ్జి వరకు 2.50 కిలోమీటర్ల పొడవు.
- దమ్మాయిగూడ పురపాలక సంఘంలో రోజ్ గార్డెన్ ఫంక్షన్ హాల్ నుంచి నాగారం రోడ్ (ఈసీఐఎల్‌ను కలుపుతూ)వరకు 2.80 కిలోమీటర్ల పొడవు,చీర్యాల జేఎన్‌ఎన్‌యూఆర్ఎం హౌసింగ్ కాలనీ నుంచి అహ్మద్ గూడ వరకు 1.70 కిలోమీటర్ల పొడవు,
- నాగారం పురపాలక సంఘంలో రాంపల్లి క్రాస్ రోడ్స్ నుంచి సర్వే నెంబర్ 421 వరకు (హెచ్‌పీ పెట్రోల్ పంప్ దగ్గర) 3.90కిలోమీటర్ల పొడవు,
- సర్వేనెంబర్ 421 (హె చ్‌పీ పెట్రోల్ పంప్ దగ్గర) నుంచి యామ్నాంపేట (నాగారం పురపాలక సంఘం సరిహద్దు వరకు)3.10 కిలోమీటర్ల పొడవు, చర్లపల్లి నుంచి ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్ వరకు (వయా కరీంగూడ) 3.80కిలోమీటర్ల పొడవు.
- యామ్నాంపేట ఫ్లైఓవర్ నుంచి డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల వరకు 2.60 కిలోమీటర్ల పొడవు, చర్లపల్లి బీఎస్ఎన్ఎల్ ఆఫీస్ నుంచి రాంపల్లి జంక్షన్ వరకు 3.30కిలోమీటర్ల పొడవు.

చెరువులో వ్యర్థాల తొలగింపు



మేడ్చల్ పెద్ద చెరువులో వ్యర్థాలను తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

మేడ్చల్: మేడ్చల్ మున్సిపాలిటీలో ఉన్న చెరువుల్లో పేరుకుపోయిన చెత్త,వ్యర్థాలతో నీరు కలుషితం అవుతున్న తీరును వివరిస్తూ సాక్షిలో గత శుక్రవారం(మార్చి31న) ప్రచురితమైన బాధ్యత ఉండక్కర్లేదా...? కథనానికి మున్సిపల్ అధికారులు స్పందించారు. శనివారం మున్సిపల్ చైర్‌పర్సన్, కమీషనర్ల ఆదేశాల మేరకు మున్సిపల్ సిబ్బంది పట్టణంలో ఉన్న మేడ్చల్ పెద్ద చెరువు, తుమ్మ చెరువు,ఇతర చెరువులో వ్యర్థాలను తొలగించారు. నీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

కలెక్టరేట్‌లో తాగునీటి సదుపాయం

సాక్షి, మేడ్చల్ జిల్లా: కలెక్టరేట్‌లో తాగునీటి సదుపాయం కల్పించడం ఎంతో ఆనందకరంగా ఉందని, దీనికి సహకరించిన దాతలకు ప్రత్యేకంగా అభినందనలు తెలియచేస్తున్నట్లు జిల్లా అదనపు కలెక్టర్ ఏనుగు నర్సింహారెడ్డి అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబుల్ (సీఎస్ఆర్) కింద కెనరా బ్యాంక్ ఆధ్వర్యంలో రూ.1.60 లక్షలతో ఏర్పాటు చేసిన ఆర్వో వాటర్ యూనిట్‌ను ఆయన ప్రారంభించారు. జిల్లా అదనపు కలెక్టర్(లోకల్ బాడీస్)అభిషేక్ ఆగస్త్య , డీఆర్ఓ లింగ్యానాయక్, లీడ్ బ్యాంకు మేనేజర్ కిశోర్ కుమార్ పాల్గొన్నారు.

కంటి వెలుగుపై సమీక్ష

ఘట్‌కేసర్: కంటి వెలుగుపై స్థానిక మండల పరిషత్ కార్యలయంలో ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి శనివారం సమీక్ష నిర్వహించారు. కంటి వెలుగు కార్యక్రమం ప్రకటనలకే పరిమితమైందని.. వైద్యసిబ్బందికి మౌళిక సదుపాయాలు కల్పించడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. నారపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి శోభన, మండల విద్యాధికారి శిదర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలకు కంప్యూటర్ల విరాళం


కీసర: చీర్యాల గ్రామంలోగల ప్రాథమిక ప్రభుత్వ పాఠశాలకు చీర్యాలలోని గీతాంజలి ఇంజినీరింగ్ కళాశాల యాజమాన్యం రెండు కంప్యూటర్లను విరాళంగా అందజేసారు. ఈమేరకు శనివారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాలకృష్ణకు కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ ప్రోగామ్ ఆఫీసర్ వరుణ్, రాథ, వైభవ్, నరేష్ అందజేసారు.

రోడ్డు కబ్జాపై నిరసన

ఘట్‌కేసర్: మున్సిపాలిటీలోని కొండాపూర్‌లో శ్మశాన వాటిక రోడ్డు కబ్జాపై స్థానికులు శనివారం నిరసన వ్యక్తం చేశారు. సర్వేనంబర్ 270లో శ్మశాన వాటిక రోడ్డును అక్రమించి హెచ్‌ఎండీఏ బ్రోచర్‌లో ప్లాట్లుగా చూపించి అనుమతి తీసుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి రోడ్డును ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

రేపటి నుంచి పదో తరగతి పరీక్షలు

- జిల్లాలో 44,014 మంది విద్యార్థులు ..220 పరీక్షా కేంద్రాలు
- కేంద్రాల్లో వసతుల కల్పన ..విద్యార్థులకు ఉచిత రవాణా సౌకర్యం
- జిల్లా విద్యాశాఖ పకడ్బందీగా ఏర్పాట్లు
- విద్యార్థులు, వారి తల్లిదండ్రుల సందేహాల నివృత్తికి టోల్ ఫ్రీ నంబర్ 040- 35659758



సాక్షి,మేడ్చల్ జిల్లా: ఈనెల 3 నుంచి 13 వరకు జరగనున్న పదో తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా విద్యాశాఖ ఏర్పాట్లు పూర్తి చేసింది. పరీక్షా కేంద్రాల్లో తాగునీటి సౌకర్యం, విద్యుత్తు, గాలి కోసం ఫ్యాన్లు, వెలుతురు వచ్చేలా అన్ని ఏర్పాట్లు చేశారు. పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మౌలిక సదుపాయాలంటినీ విద్యాశాఖ కల్పించింది. జిల్లాలో 44,014 మంది పదో తరగతి విద్యార్థులు పరీక్షలు రాసేందుకు 220 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్షల నిర్వహణకు సంబంధించి డిపార్టుమెంట్ ఆఫీసర్లుగా 220 మంది, చీఫ్ సూపరిండెంట్ ఆఫీసర్లుగా 220 మందిని విద్యాశాఖ నియమించింది. పరీక్షల్లో ఎలాంటి మాస్ కాపీయింగ్ జరగకుండా , ప్రశాంతంగా నిర్వహించేందుకు 2640 మంది ఇన్విజిలేటర్లు, 10 ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్‌లను నియమించారు. పరీక్షలకు హాజరయ్యే ప్రతీ విద్యార్థి పరీక్షా సమయానికి గంట ముందే చేరుకొని ఓఎంఆర్ షీట్ నింపాల్సి ఉంటుంది. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉండేలా చర్యలు తీసుకున్నారు. విద్యార్థుల ఆరోగ్య రక్షణ కోసం పరీక్షా కేంద్రాల వద్ద మెడికల్ సిబ్బందిని నియమించారు. పరీక్షా కేంద్రాలను సీసీ కెమెరా నిఘాలో ఉంచారు. పరీక్షలకు హాజరయ్యే పదో తరగతి విద్యార్థులకు ఉచిత రవాణా సౌకర్యం కోసం ఆర్టీసీ బస్సు వసతి కల్పించింది. జిల్లాలో పదోతరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు, వారి తల్లిదండ్రుల సలహాలు, సందేహాల నివృత్తి కోసం జిల్లా విద్యాశాఖ టోల్ ఫ్రీ నంబర్ 040- 35659758ను ఏర్పాటు చేసింది.

అభివృద్ధి, సంక్షేమ పథకాలపై నిరంతర పర్యవేక్షణ

సాక్షి, మేడ్చల్ జిల్లా: ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలపై ఎప్పటికప్పుడు జిల్లా స్థాయి అధికారులతో సమీక్ష సమావేశాలు నిర్వహించడంతో పాటు క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ అమయ్‌మార్ అన్నారు. శనివారం కలెక్టరేట్ నుంచి ఆయన వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, సీఎస్ శాంతి కుమారి, రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులతో మాట్లాడారు. కలెక్టర్ మాట్లాడుతూ జీవో 58 ,59ప్రకారం అర్హులైన వారిని గుర్తించడంతో పాటు వారికి పట్టాలను ప్రజాప్రతినిధుల ద్వారా పంపిణీ చేస్తున్నామన్నారు. జిల్లా అదనపు కలెక్టర్లు నర్సింహారెడ్డి, అభిషేక్ అగస్త్య, జిల్లా రెవెన్యూ అధికారి లింగ్యానాయక్ పాల్గొన్నారు.

అడ్మిషన్లు ప్రారంభించిన విద్యార్థులపై చర్యలు తీసుకోవాలి



ఎంఈఓ కార్యాలయంలో వినతి అందతేస్తున్న శివాజీనాయక్

ఘట్‌కేసర్: విద్యాసంవత్సరం ముగియక ముందే అడ్మిషన్లు ప్రారంభించిన విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు శివాజీనాయక్ ఆధ్వర్యంలో మండల విద్యాధికారి కార్యాలయంలో శనివారం వినతి పత్రం అందజేశారు. తమ పాఠశాలల్లో చేరాలని బోర్డులు పెడుతున్నా అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగానే ప్రవేటు, కార్పొరేట్ విద్యాసంస్థలు ఫీజుల పేరుతో విద్యార్థుల తల్లితండ్రుల రక్తాన్ని జలగల్లా పీల్చుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

రైల్వే వంతెన పనులు వేగవంతం చేయాలి

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్‌లో నిర్మిస్తున్న రైల్వే వంతెన పనులు వేగవంతం చేయాలని తెలంగాణ రాష్ట్ర రోడ్డు, భవనాల శాఖ చీఫ్ ఇంజినీర్ సతీష్‌కుమార్‌కు మున్సిపల్ చైర్ పర్సన్ పావనీ యాదవ్, జంగయ్య యాదవ్ వినతి పత్రం అందజేశారు. శనివారం ఉదయం చీఫ్ ఇంజినీర్ కార్యాలయంలో కలిసి ఏళ్లుగా వంతెన పనులు కొనసాగుతున్నాయని, జాప్యానికి కారణమైన కాంట్రాక్టర్ స్థానంలో నూతనంగా మరొకరికి అప్పగించాలని లేఖ అందచేశారు.



చీఫ్ ఇంజినీర్‌కు వినతి అందజేస్తున్న చైర్ పర్సన్ పావనీయాదవ్, జంగయ్యయాదవ్

ఎంఎంటీఎస్ రాకతో తగ్గనున్న ప్రయాణభారం



మేడ్చల్ రైల్వే స్టేషన్

మేడ్చల్: మేడ్చల్ నుండి సికింద్రాబాద్, ఉందానగర్ వరకు త్వరలో ఎంఎంటీఎస్ రైళ్ళు ప్రారంభం కానుండటంతో ప్రయాణ సమయంతో పాటు ప్రయాణ భారం తగ్గనుంది. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న రైల్వే ఆధునీకరణలో భాగంగా కరోనా కంటే ముందే మేడ్చల్ లైన్ ను డబ్లింగ్ లైన్‌గా మార్చి విద్యుదీకరణ పూర్తి చేశారు. కరోనా తర్వాత రైళ్లు పూర్తిగా తగ్గించి మేడ్చల్ నుండి సికింద్రాబాద్ ప్రస్తుతం వారంలో ఆరు రోజులు మూడేసి రైళ్లు మాత్రమే నడుస్తున్నాయి.

8న ప్రారంభం కానున్న ఎంఎంటీఎస్ రైళ్ళు...

నగరంలోని ఎంఎంటీఎస్ రెండో దశ రైళ్ల ప్రారంభోత్సవానికి, సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ఆధునీకరణ పనులు ప్రారంభించడానికి ప్రధాని నరేంద్రమోదీ రానుండటంతో మేడ్చల్ కు రైళ్లు ప్రారంభం కానున్నాయి. మేడ్చల్‌కు ఎంఎంటీఎస్ రైళ్లను సికింద్రాబాద్ స్టేషన్‌లో ప్రధాని మోదీ, మేడ్చల్ లో రైల్వే డీఆర్ఎంలు రైళ్లను ప్రారంభిస్తారని రైల్వే అధికారులు తెలిపారు.

తగ్గనున్న ప్రయాణ సమయం

మేడ్చల్ నుండి నగరానికి వెళ్లాలంటే ప్రస్తుతం 44వ జాతీయ రహదారి విస్తరణ పనులు జరుగుతుంటడంతో ట్రాఫిక్ సమస్య వల్ల గంటన్నర రెండు గంటల సమయం పడుతోంది. సాధారణ సమయాల్లో సులువుగా గంట పడుతోంది. ఎంఎంటీఎస్ రానుండటంతో ప్రయాణ సమయం, ప్రయాణ భారం రెండు తగ్గనున్నాయి. 45 నిమిషాల నుండి గంట లోపు నగరానికి చేరుకోవచ్చు. నగరంలో ఏ ప్రాంతానికి వెళ్లాలన్నా సికింద్రాబాద్ మెయిన్ పాయింట్ కావడం సికింద్రాబాద్ కు ఎంఎంటీఎస్ రైళ్ళు వెళ్లనుండటంతో ప్రయాణం సులువు కానుంది.

ఆలయానికి రూ.లక్ష విరాళం



ఆలయాలనికి విరాళం అందజేస్తున్న మెగా ఇంజనీరింగ్ గ్యాస్ ప్రతినిధి

మేడ్చల్‌రూరల్: మండలంలోని పూడూర్ గ్రామంలోని రామభక్త ఆంజనేయ స్వామి ఆలయానికి మెగా ఇంజనీరింగ్ గ్యాస్ సంస్థ రూ. లక్ష విరాళం అందజేసింది. శనివారం సంస్థ ప్రతినిధి సాయి క్రిష్ణ ఆలయంలో పూజలు నిర్వహించి రూ. లక్ష నగదును గ్రామ సర్పంచ్ బాబుయాదవ్, ఆలయ నిర్వాహకులకు అందజేశారు.

మేడ్చల్‌కు చేరిన మాదిగల సంగ్రామ యాత్ర

మేడ్చల్: ఎస్సీ వర్గీకరణ సాధన కోసం ఎమ్మార్పీఎస్ చేపట్టిన మాదిగల సంగ్రామ యాత్ర శనివారం మేడ్చకు చేరింది. గత నెల 2వ తేదీన ఆదిలాబాద్ నుండి చేపట్టిన సంగ్రామ యాత్ర మేడ్చల్ మండలానికి చేరడంతో ఎల్లంపేట్ వద్ద మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు పరశురాం మాదిగ ఆద్వర్యంలో స్థానిక నాయకులు ఘనస్వాగతం పలికి యాత్ర చేపట్టారు.



సంగ్రామ యాత్రలో ఎమ్మార్పీఎస్ నాయకులు

క్లుప్తంగా

ఆలయానికి కార్పొరేటర్ విరాళం



జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ మార్కెట్ రోడ్డులోని శ్రీసీతారామాంజనేయ స్వామి ఆలయ అభివృద్ధి పనుల నిమిత్తం కార్పొరేటర్ జమాల్‌పూర్ నవీన్‌కుమార్ రూ.50 వేలు విరాళంగా అందచేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

టీఎస్‌పీఎస్సీ పాలకమండలిని రద్దుచేయాలి

కీసర: తెలంగాణ రాష్ట్రంలోని 30 లక్షలమంది నిరుద్యోగుల జీవితాలతో ఆటలాడుతున్న టీఎస్‌పీఎస్సీ పాలకమండలిని రద్దుచేసి తిరిగి కొత్తపాలకమండలిని ఏర్పాటుచేసిన తరువాతే ఉద్యోగాల నియామకాలు జరపాలని బీఎస్పీ మేడ్చల్ నియోజకవర్గ అధ్యక్షులు బోడజంగయ్య డిమాండ్ చేసారు. శనివారం కీసరలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న నిరుద్యోగుల తరపున ప్రభుత్వంపై పోరాటంచేసేందుకుసిద్ధంగా ఉన్నామన్నారు.

విద్యార్థులకు హాల్ టికెట్ల పంపిణీ



ఘట్‌కేసర్: పదో తరగతి పరీక్షల్లో 10 పాయింట్లు సాధించి గ్రామానికి, ఉపాధ్యాయులకు, తల్లితండ్రులకు మంచి పేరు తేవాలని సర్పంచ్ కావేరి అన్నారు. అవుషాపూర్ జెడ్పీ స్కూల్ లో పదో తరగతి విద్యార్థులకు ఉప సర్పంచ్ ఐలయ్యయాదవ్‌తో కలిసి శనివారం హాల్ టిక్కెట్లు పంపిణీ చేశారు. సర్పంచ్ మాట్లాడుతూ ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలన్నారు. మశ్చేందర్‌రెడ్డి, వార్డు సభ్యులు కుశలవరెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, మల్లేశ్, వీరేశం, హెచ్‌ఎం రవి పాల్గొన్నారు.

పేదవిద్యార్థినికి ఆర్థికసాయం

కీసర: కీసర గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబానికి చెందిన విద్యార్థిని వేముల శ్రీలత ఉన్నత చదువుల నిమిత్తం కీసర గ్రామానికి చెందిన బిఆర్ఎస్‌నేత గుర్రం శ్రీధర్‌రెడ్డి శనివారం రూ.10 వేల ఆర్థికసాయం అందజేసారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నేత గోరంటి ప్రవీణ్ పాల్గొన్నారు.

చిరుధాన్యాలపై అవగాహన

కీసర: దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలోని అహ్మద్‌గూడ 5వ వార్డులోని అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం పోషణపక్షం కార్యక్రమంలో భాగంగా మిల్లెట్స్(చిరుధాన్యాలు)పై అవగహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ప్రణితాగౌడ్, కౌన్సిలర్ కొత్తసురేఖ భాస్కర్‌గౌడ్, సుజాతశ్రీనివాస్, వెంకటేష్ పాల్గొన్నారు.

ఐసీడీఎస్ సేవలు ఎనలేనివి

మేడ్చల్ రూరల్: చిన్నారులు, గర్భిణులకు పోషకాహారం అందించి వారికి అనారోగ్య ముప్పు తొలగించడంతో ఐసీడీఎస్ ముందు వరుసలో ఉంటుందని మేడ్చల్ మున్సిపల్ చైర్‌పర్సన్ మర్రి దీపిక నర్సింహారెడ్డి, మున్సిపల్ కమిషనర్ రాములు అన్నారు. శనివారం మున్సిపల్ కార్యాలయంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ పక్షోత్సవం నిర్వహించి మహిళలకు చిరుధాన్యాలపై అవగాహన కల్పించారు.

అవుషాపూర్ సర్పంచ్‌కు సన్మానం

ఘట్‌కేసర్: జిల్లాలో ఉత్తమ పంచాయతీగా ద్వితీయ స్థానం అవార్డు అందుకున్న అవుషాపూర్ సర్పంచ్ కావేరి, కార్యదర్శి గౌతమిని పంచాయతీ కార్యాలయంలో శనివారం సన్మానించారు. ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి హాజరై శాలువాతో వారిని సత్కరించారు.

స్త్రీశక్తి లేనిదే సమాజం ముందుకు సాగదు

కీసర : స్త్రీ శక్తి లేనిదే సమాజం ముందుకు సాగదని మల్లారెడ్డి హెల్త్‌సిటీ డైరెక్టర్ చామకూర ప్రీతిభద్రారెడ్డి అన్నారు. దమ్మాయిగూడలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో ఆమె పాల్గొన్నారు. నేటి సమాజంలో మహిళలు అన్నిరంగాల్లో పురుషులకు దీటుగా సేవలందిస్తూ గుర్తింపు పొందుతున్నారన్నారు. అఖిలభారత పద్మశాలిసంఘం జాతీయ అధ్యక్షులు కందగట్ల స్వామి తదితరులు పాల్గొన్నారు.

వివిధ వార్డుల్లో అభివృద్ధి పనులు

కీసర: నాగారం మున్సిపాలిటీపరిధిలోని వివిధ వార్డుల్లో అభివృద్ధి పనులు చేపడతామని మున్సిపల్ చైర్మెన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. శనివారం మున్సిపల్ పరిధిలోని 1వ వార్డులోని కృష్ణారెడ్డి నగర్‌కాలనీలో రూ.15 లక్షల మున్సిపల్ నిధులతో చేపడుతున్న డ్రైనేజీ పనులను ఆయన డాఊఊ సుదర్శనంతో కలిసి పరిశీలించారు.